సాలిని

హైదరాబాదులోని మధ్యతరగతి వాళ్ళు నివసించే బస్తీ అది. ఎప్పుడో కట్టిన యిండ్లు కావటం వల్లా మిద్దెలు, పెంకుటిండ్లు గానే మిగిలి పోయిన ఆ ప్రాంతంలో చిన్న వరండా, బాత్‌రూం గల ఓ గదిని కిరాయికి తీసుకుని ఉంటుంది సాలిని.

బయటికి వెళ్ళటానికి గదికి తాళం వేసి 'కీ'ని బ్యాగ్‌లో వేసుకుంటూ రోడ్డు వైపు నడిచే సరికి ఎదురుగా ఆ బస్తి యువకులు, వయసు దాటిన ఆడ వాళ్ళు వచ్చి నిల్చున్నారు.

సాలినికొంగు భుజాల చుట్టూ కప్పుకుంటు 'ఏమిటి' అన్నట్టు చూసింది.

అందరూ మౌనంగా నిలుచున్నారు. రోజూ చూస్తున్న వాళ్ళయినా ఒకేసారి వచ్చి ఎదురుగా నిల్చుండేసరికి కొంచెం కలవరం అన్పించినా, విషయం ఏమిటో తెలుసుకోవాలని నిశ్చలంగా నిల్చుంది సాలిని.

"చెప్పండి నాతో ఏమైనా పనా ?"

"పనేమీ లేదు, రోజూ ఎక్కడికి వెళుతున్నావు ?" ఓ యువకుడు పాంట్‌జేబుల్లో తన చేతులను దూర్చి నిర్లక్ష్యంగా చూస్తూ అడిగాడు.

"నా పనిమీద నేను"

"అదే ఏంపని?" మరో యువకుడు తన రెండు చేతులను' మెడ మీద వుంచి, వేళ్ళమధ్యకు వేళ్ళు చొప్పించుకుంటూ అడిగాడు.

తాను చేస్తున్నపని వీళ్ళకెందుకు చెప్పాలో అర్థం కాక ఏమిటి గోల అన్నట్లు ఆడవాళ్ళ వైపు చూసింది.

"ఆమె ఏం పనికి పోతే మనకెందుకు మనక్కావలసింది యిల్లు ఖాళీ చెయ్యడమే గదా" అన్నది ముందు నిలుచున్నావిడ సాలిని వైపు చూడకుండా అడిగిన వాళ్ళ వైపు మళ్లీ.

"అంతే అంతే" అన్నారు దాదాపు అందరూ ఒకేసారి.

మరో ముసలమ్మ కాస్త ముందకొచ్చి "సూడమ్మా, బస్తీల రోజు నీగురించె గుస గుస. వొచ్చినప్పుడు ఓమాదిరిగ వుంటివి, రాంగ రాంగ ఎట్లనొ మారిపోతుంటివి. పొద్దున పోతవు పొదుగూకి వొస్తవు. మళ్ళ రాత్రి ఏడింటికి పోతవు సిన్మా వొద్లినంక వస్తవు' అంది.

"ఏదో ఓ పని చేస్తేనె గద గడిచేది పొద్దంతా పొట్ట పోసుకోవడానికి, రాత్రి బాధలను మరిచిపోయి బతుకు మీద మమకారం పెంచుకోవడానికి పోక తప్పదు" చేతిలోని బాగ్‌ను బుజానికి వేసుకుంటు అంది.

"నీపనె నీవు జేసుకుంటవు గాని, రోజుకొకరు స్కూటర్ మీద, మోటర్ మీద దించి పోతుండ్రాయె. పెండ్లి కాలేదంటివి యింతమందితో తిర్గుతుంటివి. అందుకె ఈ బస్తీల వుండొద్దు అంటుండ్రు," అంది ఆ ముసలమ్మ.

"మనం మంచిగుంటె ఎవ్వరితొ తిరిగితె ఏమైందవ్వా" ముఖాన చిరు నవ్వును పూయిస్తూ ముసలమ్మను ఉద్దేశిస్తూ అంది. కాని ఆ అడగడం అందర్ని ప్రశ్నిచినట్లనిపించింది.

"ఏంమంచొ ఏం చెడొ ఈయల్ల రేపు కాలం నమ్మ రాకుంట వుంది." అంది, ఎడమ చేతిని కడుపు మీద పెట్టుకుని కుడి చేతిని నోటికి అడ్డంగా పెట్టుకుంటూ.

"ఈమె తిరుగుడు పొంగ మనరాజేష్‌ను తిట్టిందట, గోపాల్‌ను తిట్టిందట. పడుసు పోరగాండ్లను తిడితె వూర్కుంటర? ఎవ్వర్నని ఆపుతము" అంది మొదటావిడ ఓమాదిరి నిష్ఠూరాన్ని ప్రదర్శిస్తూ.

"మీరు యింత మంది ఒకేసారొచ్చి యిల్ల అడిగితె యిప్పుడేమి చెప్పలేను. యిల్లు ఖాళీ చేయ్యాలంటె మరో యిల్లు చూసుకుని ఖాళీ చేస్త. నాకు టైమైంది" అంటూ రోడ్డు వైపు నడిచింది. ఆ నడకలో కొంత విసుగు, మరికొంత కోపం కనిపించింది.

"హా! యీమధ్య చీరల మీద చీరలు కడుతుంది బొమ్మ" అంది ఓ స్త్రీ. ముక్కు మీద వేలుంచి, పోతున్న ఆమెనే చూస్తూ.

"కొనిస్తోల్లు వుంటె ఎందుక్కట్టదు ?" ఏదో రహస్యాన్ని ప్రకటిస్తున్నట్లు అన్నాడు ఓ నడి వయస్సు వ్యక్తి.

"అవన్ని మనకెందుకు ఖాళీ చేస్తనంది గదా" అంటూ అందరూ అక్కడి నుండి కదిలారు రకరకాల ఆలోచనలతో.

ఆమె రిక్షాను పిలిచి మాసాబ్‌టాంక్ అంటూ కూర్చుంది.

సాలిని తలనిండా ఆలోచనలె–

ఆడదాని బతుక్కు అన్ని ఆటంకాలె, తాను ఆడదిగ పుట్టినందుకు తనను తాను తిట్టుకుంది. చదివినా

వుద్యోగం యివ్వని ప్రభుత్వాన్ని తిట్టింది. తన పని తాను చేసుకొని తన బ్రతుకు తాను బ్రతుకుతుంటె చూసి వోర్వలేని జనాన్ని తిట్టింది. అప్పుడప్పుడేమ్మడిపడి అవస్త పెట్టే కుక్కబుద్ధిగల మనుషులను తిట్టింది. ఆఖరికి ఈ రోజు యిల్లు ఖాళీ చేయమన్న వాళ్ళను తిట్టింది. ఈలోగా రిక్షా మహావీరు హాస్పిటల్ ఎదురుగ వెళ్ళగానె, "ఆ ఆపు" అంటూ దిగి, యివ్వవల్సినంత రిక్షావాని చేతిలో పెట్టింది.

ఎదురుగ నవ్వుతూ ఓ కళ్ళద్దాల యువకుడు.

చూపులతో పలుకరించుకున్నారు. నవ్వులతో కలిసి నడిచారు. కొంతదూరం నడిచాక "మీరు ముందు నడవండి." అని కాస్త ఆగి ఆమె వెనకాలే ఆమె నడకను, నడిచేటప్పటి కదలికలను తన కను రెప్పల కింద పేర్చుకుంటూ నడుస్తున్నాడు.

సాలినిది సన్నని నడుము పోను పోను వెడల్పైన భుజాలకు బరువైన వక్షస్థలం. శ్రద్ధతో చెక్కిన అందమైన శిల్పంలాంటి ముఖవర్చస్సు. మెడ భాగాన్ని కప్పివుంచె వొదులైన కొప్పు. పాతికేళ్ళ పడుచుదనం పోతపోసుకుని చామనచాయలో ఆకర్షణను అద్దుకొన్న విగ్రహం.

**

ఇంట్లోని సామానంతా మూడు రిక్షాల్లో నింపి చేతులు దులుపుకుంటూ వొచ్చి యింటి ముందు నిలుచుంది.

అంతకంటె ముందె సామానులను సర్దుతున్న ఆమెను, ఎస్తూ పోతూ చూస్తూ కొంత దూరంలో అందరూ గుస గుసలాడుతూ నిల్చున్నారు.

సాలిని పెదవులపై నవ్వును పులుముకుంటూ అందర్నీ రమ్మన్నట్లు సైగ చేసింది. ఆడ, మగ, చిన్న పెద్ద అందరూ వచ్చి చుట్టూ చేరారు.

"ఇల్లు ఖాళీ చేశాను. అందర్కి నమస్కారాలు. ఈ బస్తీ వాళ్ళు నన్ను మంచిగనే చూశారు. ఈమధ్యనే ఎందుకో నా మీద కోపం వచ్చింది." రొండిన చెక్కివుంచిన కొంగును వొదులుతూ అంది.

అందరూ చూస్తూ నిలుచున్నారు తప్ప ఎవ్వరూ ఏం మాట్లాడ లేదు.

"అందర్కి బాగ బతకాలనె వుంటుంది. కాని బతకలేక పోతున్నాం. ఉద్యోగం చెయ్యాలని వుంది. అది అంత సులభంగా దొరకదే! యింకేది చెయ్యాలన్నా రక్షణ లేదు. పుట్టింది పల్లెటూరు. నాన్న చిన్నప్పుడే పోయాడు. అన్నలు, తమ్ములు ఎవరు లేరు, ఒక్క అమ్మ తప్ప. ఆమె ఊరు వదలదు. ఊళ్ళో నాకు బ్రతికే అవకాశం

లేదు. పెళ్ళి సంబంధాలొస్తున్నా, ఏమీ యివ్వలేమని తెలుసుకున్నాక మాట్లాడకుండా వొచ్చినదారి పడుతూ వున్నారు.

ఓ స్నేహితురాలి సహాయంతో ఈ పట్టణం వొచ్చాను. అప్పటివరకు "సాలమ్మ" అని వున్న నా పేరును "శాలిని"గ మార్చింది ఆమె.

స్త్రీకి మిగిలింది ఏమిటి తనవొళ్ళు, ఒంటరిగవున్న స్త్రీని ఎన్ని కందిరీగలు కరవచూస్తయి. ఎన్ని పిచ్చికుక్కలు కాటెయ్య చూస్తయి. అన్నిటినీ తప్పించ్చుకుంటూ నడవాలి. నేను రాజేష్‌ను ఉర్కెనే తిట్టలేదు. ఈమధ్య అతను నేను స్నానం చేసేటప్పుడు వేప పుల్లల కోసం చెట్టెక్కేవాడు. మా బాత్‌రూంకు కప్పు లేదు. ఇక గోపాల్, రాత్రిపూట జనం రాకపోకలు ఆగిపోయినాక వొచ్చి కిటికీ గుండా చూసేవాడు. అందుకని వాళ్ళను మందలించానే తప్ప అహంకారంతో తిట్ట లేదు.

పెళ్ళి కాకుండా వున్నందుకు అందర్కి లోకువే. రోజూ ఎన్నో అవమానాలు మరెన్నో అనర్థాలు. ఓ పెద్ద మనిషి వుంపుడుగత్తెగ వుండమంటాడు. మరొక ప్రబుద్ధుడు రెండవ పెళ్ళాంగ చేసుకుంటానంటాడు. రెండవ పెళ్ళానిగనైతే కట్నం లేకున్న పర్వలేదట. ఉంపుడుగత్తెగ

నైతే ఎదురిస్తా నంటాడు. యిది మన వివాహ వ్యవస్థ వ్యాపార సంస్కృతి ! "శాలిని" గ నా పేరు సార్థకం అవుతుందనే ఆశ రోజు రోజుకు సన్నగిల్లసాగింది. అందువల్ల నా పేరును మరొకసారి "సాలిని"గ సరిచేసుకోవడం జరిగింది.

నేను రోజు పొద్దుటే వెళ్ళి పొద్దుగూకేవరకు ఆర్ట్స్ కాలేజిలో మోడల్‌గ పనిచేస్తున్నానే తప్ప వొళ్ళు అమ్ముకోలేదు. అక్కడ శృంగార భంగిమల చిత్రాలు గీస్తారు. అంతే.

మీరన్నట్లు రోజుకొకరితో వచ్చేదీ నిజమే. నన్ను ఆరోజు మోడల్‌గ ఎంచుకున్న వ్యక్తిస్థాయిని బట్టి దిగబెడుతూ వుంటారు" అంటూ అప్పుడే వొచ్చి సైకిల్ దిగి ఏదో చెప్పబోయిన వ్యక్తితో 'ఏం రంగన్నా యిలా వచ్చావు?'

"వారం రోజుల నుండి తమరు రాకపోయేసరికి పిలుచుకు రమ్మని పంపించిను." అంటూ ఓ చేత్తో సైకిల్ పట్టుకుని మరో చేత్తో తలపై టోపి సరిచేసుకున్నాడు.

అతను వేసుకున్న కాకిచొక్కా జేబు పైన "హెల్పాంఫర్ ఓల్డ్ ఏజ్" అని ఎర్రదారంతో ఎంబ్రాయిడరీ చేసివుంది.

"అలాగా? ఇల్లు ఖాళీ చెయ్యవలసి వస్తే మరో ఇల్లు

వెదకటంలో రాలేకపోయాను. అందరు బాగున్నారు కదా?" ఆప్యాయంగా అడిగింది.

"ఉన్నారు కాని మహాలక్ష్మమ్మ చనిపోయింది. మగవాళ్ళల్లో రంగారావూ పోయాడు. జానకమ్మ రేపో మాపో" విచారంగా చెప్పాడు.

ఆమె కళ్ళల్లో నీరు వూరింది. రెండు క్షణాల మౌనం. ఆమె ముక్కు పుటలను కదిలించింది. "డాక్టర్ రావటం లేదా? వేళకు మందులు వేసుకోవడం లేదా?" ఆందోళనగా అడిగింది.

"మీరు లేకుంటే ఆ వేం ముసలాళ్ళు ఎవరికీ వినరు. పొద్దుగూకి ఏడుకాగానే మీకోసం ఎదురు చూస్తూ వుంటారు."

"ఈరోజు తప్పక వస్తా పద" అంటూ అందరివైపు మళ్ళి చేతులు జోడించి వెళ్తానన్నట్లు తలాడించి రిక్షాలో కూర్చుంది. రిక్షాలు కదిలాయి. వాటి వెనకాలే రంగన్న సైకిల్.

అందరూ చూస్తూ నిల్చున్నారు ఎవరినోటా మాటరాలేదు.

1993

కథా నిలయం
693
శ్రీకాకుళం